# చలి

గట్టిగా కౌగిలించుకుని పదిసార్లు ముద్దు పెట్టుకుని వదల్లేక వదల్లేక వదిలింది కమలాదేవి, రాజాని.

ఎనిమిదొందలిచ్చి ఆవిడ ఈ మధ్యనే కొన్న అల్సేషియన్ కుక్క, రాజా అంటే. కుక్కలంటే ఆమెకి అంత ఇష్టం. ఇంతకిముందే అయిదు కుక్కలున్నాయి ఆవిడకి. చీరలు కొన్నట్టుగా కుక్కల్ని కొని, చీరెలు మార్చినట్టుగా కుక్కల్ని మార్చటం సరదా కమలాదేవికి. అసలు చీరెల కంటె, నగల కంటే, కుక్కలంటేనే ఎక్కువిష్టమేమో! చీరెలూ, నగలేమిటి, మొగుడి కంటే కూడా కమలాదేవికి కుక్కలే ఇష్టమంటారు, గిట్టని వాళ్ళు కొందరు.

కమలాదేవిని చూసినవాళ్ళు ఆవిడకి ముప్ఫయారేళ్ళ వయసుంటుందనీ, ఏమంత పెద్ద అందగత్తె కాదనీ చటుక్కున గ్రహించలేరు. అలంకరించుకోవడంలో గొప్ప నేర్పుందావిడకి.

ఆ వేళ కూడా పాతికేళ్ళ పడుచులా తయారైంది; మిలమిలా మెరిసే చీరె కట్టుకుంది; ధగధగలాడే రాళ్ళున్న నెక్లెస్ పెట్టుకుంది. ఘుమఘుమలాడే విదేశీ సెంటు పూసుకుంది.

ఈ రకంగా అలంకరించుకోవటమూ, ఈ వేళకి బయల్దేరి క్లబ్బుకెళ్ళటమూ, వెళ్ళేముందు కుక్కల్ని కౌగిలించుకుని ముద్దు పెట్టుకోవటమూ కమలాదేవికి కొత్త కాదు. రోజూ అలవాటే.

బయల్దేరేముందు ఏదో గుర్తొచ్చి, పైకి తన గదిలోకి వెళ్ళి, ఏదో జంతువు చర్మంతో, బొచ్చుతో చేసిన కోటు తొడుక్కొచ్చింది – చలిబాధ తప్పించుకోవటానికి. పోర్టికోలో కారెక్కేముందు రంగణ్ణి పిలిచి "ఒరే! రాజాని జాగ్రత్తగా చూస్తుండు. పిచ్చి వెధవ బయట తిరుగుతాడేమో. తిరగనీకు. ఇవ్వాళ మరీ చలి ఎక్కువగా వుంది. నేనొచ్చేసరికి బాగా పొద్దుపోవచ్చు. అయ్యగారితో చెప్పు" అని ఆదేశాలిచ్చింది.

రంగడు "అలాగేనమ్మా! అలాగే. చిత్తం.. చిత్తం.." అంటూండగానే ఇంపాలా కారు గేటు దాటి బయటికెళ్ళిపోయింది.

వరండాలో ఒక మూల చతికిలబడి ముడుచుకు కూర్చున్నాడు రంగడు. చలికాలం కావడం మూలాన ఆరింటికే చీకటిపడ్తోంది. నాల్రోజులుగా విపరీతంగా వేస్తున్న చలి ఆ వేళ మరీ పేట్రేగిపోయింది. ఆరింటికే గజగజలాడించేస్తోంది.

"రాజా" బయటికొచ్చి తిరుగుతూంటే రంగడు లేచి, దాన్ని బుజ్జగించి బతిమాలి లోపలికి తీసుకెళ్ళాడు.

కుక్కల పాలనలో ఏ మాత్రం లోటొచ్చినా సహించదు కమలాదేవి. ఆ సంగతి రంగడికి బాగా తెలుసు. అంచేత రాజాని హాల్లో వదలి, దాన్ని కనిపెట్టుకుని తనూ అక్కడే కూర్చున్నాడు. అక్కడ కాస్త వెచ్చగా వుంది.

కుక్కలకి కూడా చలి వుంటుందా అనే సందేహమొచ్చింది రంగడికి. ఎంతసేపు ఆలోచించినా సందేహం తీరలేదు. ఆ తరవాత తన యజమానురాలు తొడుక్కెళ్ళిన చలికోటు ఖరీదెంత వుంటుందో కొంతసేపు ఆలోచించాడు. అదీ అతని ఊహకందలేదు. అతని వూహకందనివీ, అతని కర్థం కానివీ ఇంకా చాలా వున్నాయి.

కమలాదేవి రోజూ ఈ రకంగా క్లబ్బుకనీ, అక్కడికనీ, ఇక్కడకనీ వెళ్ళటమేమిటో, వెళ్ళి ఏ పన్నెండింటికో, ఒంటిగంటకో రావటం. ఒక్కొక్కసారి తెల్లారేవరకూ రాకపోవటమేమిటో, అయినా రాజారావు పల్లెత్తుమాట అనకపోవటమేమిటో రంగడికి ఎన్నాళ్ళనుంచో అర్థం కావటం లేదు. ఇన్ని మేడలెందుకో, ఇన్ని కార్లెందుకో, ఇంత డబ్బుతో ఏం చేస్తారో అర్థం కాదు – రాజారావుది చాలా పెద్ద వ్యాపారమని చెప్పుకుంటారు. అదేమిటో కూడా తెలియదు రంగడికి.

గడియారం ఏడు గంటలు కొట్టింది.

చలి ఎక్కువౌతోంది. ఇంట్లో గింజలు లేనినాడు పేదవాడి ఆకలి పెరిగినట్లు, వరదొచ్చి నది పెరిగినట్లు, రోజురోజుకీ రాజారావు ఆస్తి పెరిగినట్లు, కమలాదేవి షోకు పెరిగినట్లు, క్రమక్రమంగా పెరిగిపోతోంది చలి.

రాజారావు త్వరగా వచ్చేస్తే బావుండుననుకున్నాడు రంగడు. "ఇయ్యాల సందకాడే వచ్చేత్తా"నని వాగ్దానం చేశాడు సీతకి. నిరుడే పెళ్ళయిందతనికి. రెణ్ణెల్ల క్రితం ఒక మగబిడ్డ. నగరానికి ఎడంగా మూడు మైళ్ళవతల కాపరం. అక్కడ మొత్తం యాభై అరవై గుడిసెలున్నాయి. వాటిలో కాస్త కొత్తగా వున్న గుడిసె రంగడిదే.

మిగతా గుడిసెలూ, వాటిలో వుండే వాళ్ళ బ్రతుకులూ కూడా శిధిలాలే. అసలక్కడ మనుషులుండరు. దరిద్రదేవత ఎత్తిన కొన్ని వందల అవతారాలుంటాయి. ఆకలి, చీకటి, మురుగూ, ఇవే వుంటాయి.

నిన్నరాత్రి వేసిన చలికి ఆ మురికివాడంతా గజగజలాడిపోయింది. కడుపునిండా తిండి లేక, కప్పుకోను బట్టలేక, గుడిసెల్లో వాళ్లంతా విలవిల్లాడిపోయారు.

రంగడి కొడుకు – రెణ్ణెల్ల పసివాడు చలికి తట్టుకోలేక గుక్కలు పట్టి ఏడ్చాడు. ఉన్న పాతగుడ్డలన్నీ వాడికి కప్పి పడుకోబెట్టింది సీత.

ఎక్కణ్ణించో కాస్త ఎండుగడ్డి తెచ్చి, అందులో కాస్త తగలేసి, చలి కాచుకుని మిగతాది నేల మీద పరిచి దానిమీద చిరిగిపోయిన దుప్పటొకటి వేసి పడుకున్నారు రంగడు, సీతాను. చిరిగి జీరికలైపోయిన ఒక చీర, అటువంటిదే మరో దుప్పటీ కలిపి కప్పుకున్నారు. చలి ఎంత మాత్రమూ ఆగలేదు.

ఇవ్వాళ రంగడు పనిలో కొచ్చేటప్పుడు – దొరనడిగి డబ్బు తీసుకుని కాస్త మందపాటి దుప్పటొకటి కొనుక్కురమ్మనీ, పెందరాడే ఇంటికి రమ్మనీ చెప్పింది సీత, రంగడు సరేనన్నాడు.

చలి పెరుగుతోంది. నాయకుల్లో స్వార్థం పెరిగినట్టు, అధికారుల్లో అవినీతి పెరిగినట్లు, నిత్యావసరవస్తువుల ధరలు పెరిగినట్లు చలి పెరుగుతోంది.

రాజారావు రాగానే త్వరగా వెళ్ళిపోవటాని కనుమతి తీసుకుని, డబ్బు తీసుకుని ఇవ్వాళ్ళేమైనా సరే దుప్పటి కొనుక్కెళ్ళాలని కాచుక్కూచున్నాడు రంగడు.

ఏడున్నరైంది. ఎనిమిదైంది.

అప్పుడొచ్చాడు రాజారావు. ఎనభైవేల రూపాయల కారులో వచ్చాడు. ఎనిమిదొందల రూపాయల సూటులో వచ్చాడు.

ఒంటరిగా రాలేదు. వెంటనొక వయ్యారి భామని తీసుకొచ్చాడు.

ఆమె మంచి వయసులో వుంది. అందంగా బలిసివుంది. పల్చటి చీరె కట్టుకుంది. నున్నటి స్తంభానికి చుట్టినట్టుగా వొంటికి అంటీ అంటనట్టుగా వుంది ఆ చీరె. చేతుల్లేని జాకెట్టు తొడుక్కుంది.

ఆమెని వెంటబెట్టుకుని సరాసరి పైకి తన గదిలోకి వెళ్ళిపోయాడు రాజారావు. రంగడు వెనకాలే వెళ్ళాడు. కోటూ, టై విప్పి ఓ మూలకి విసిరేసి సోఫాలో కూలబడ్డాడు

రాజారావు. "కమాన్! రోజీ డియర్!" అని పిలిచాడు. అప్పటిదాకా గదంతా కలయచూస్తున్న ఆ వయ్యారి భామ వచ్చి సోఫాలో రాజారావు పక్కనే కూర్చుంది. రంగడు బూట్లు విప్పుతుండగా "ఒరే రంగా! ఇవ్వాళ బాగా చలిగా వుందిరా!" అన్నాడు రాజారావు.

"అవును దొరా! వేడి వేడి కాఫీ పట్రమ్మంటారా?" అని అడిగాడు రంగడు. రాజారావు బిగ్గరగా నవ్వి "కాఫీ తాగితే చలి తగ్గుతుందట్రా ఫూల్! నువ్వేం తేవద్దు గానీ ఆ కిటికీ తలుపులన్నీ మూసేసి, పెరుమాళ్ళు గాణ్ణి ఒకసారి పిల్చుకురా" అన్నాడు.

రంగడు కిటికీ తలుపులు మూసేసి కిందికెళ్ళి పెరుమాళ్ళుని తీసుకొచ్చాడు.

"ఏరా! ఈ పూట ఏం వండావ్?" అనడిగాడు రాజారావు.

"ఆలూ కుర్మా, వంకాయ పులుసూ, దోసకాయ చట్నీ, చిప్సు సాంబారు, రసం.." ఒక్క గుక్కలో పాఠం చదివినటు చదివాడు పెరుమాళ్ళు.

"యూ రాస్కెల్! ప్రొద్దున్నేమని చెప్పాన్రా నీకు? ఇవ్వాళ కోడి కావాలని చెప్పానా లేదా?"

రాజారావు గర్జనకి అదిరిపోతూ "చిత్తం...చిత్తం.." అని నసిగాడు పెరుమాళ్ళు.

"మరెందుకొండలేదు"?

"మర్చిపోయాను సార్!"

"మర్చిపోతావురా... నీకీ మధ్య ఒళ్ళు కొవ్వెక్కిందిరా రాస్కెల్. ఈ చలిలో చికెన్ లేకుండా, మటన్ లేకుండా ఏం తింటారనుకున్నావురా! ఆ మాత్రం బుద్ధి వుండక్కర్లా? పో. ఇంకా ఎందుకిక్కడ దున్నపోతులా నిలబడ్డావు. పో రా!"

తలొంచుకుని నెమ్మదిగా వెళ్ళిపోయాడు పెరుమాళ్ళు.

"ఒరే! 'త్రీస్టార్' లో మంచి నాన్ వెజిటేరియన్ డిషెస్‌వుంటాయి. నువ్వు త్వరగా కారులో వెళ్ళి పట్రా" అన్నాడు రాజారావు రంగడితో.

"ఏమేమి కావాలి సార్?" అని అడగబోయాడు రంగడు. "నీ వెధవ ప్రశ్నలతో టైం వేస్ట్ చేయకు. ఏమేమి కావాలో నేను వాడికి ఫోన్ చేసి చెప్తాను. నువ్వు త్వరగా వెళ్ళి వాడేది ఇస్తే అది పట్రా. ఊ.. పరుగెత్తు.."

★ ★ ★

ఎనిమిదిన్నరకే రోడ్లు దాదాపు నిర్మానుష్యంగా వున్నాయి. చలికి జడిసి ఎవరూ బయట తిరగటం లేదు. తిరిగినా చలికి తట్టుకోగలిగిన దుస్తులు వేసుకుని తిరుగుతున్నారు. దుకాణాలు కూడా కొన్ని మూసేశారు. ఇంక ఇవ్వాళ దుప్పటి కొనుక్కెళ్ళే ఆశ లేదనుకున్నాడు రంగడు. దుప్పటి లేకపోయినా కనీసం త్వరగా ఇంటికెళ్ళడానికి కూడా వీలుండదేమోనని భయం పట్టుకుంది. సీత తనకోసం ఎదురుచూస్తూ వుంటుంది. దుప్పటి తెస్తాడని ఆశతో వుంటుంది. ఊరి బయట మరీ చలెక్కువ. పిల్లాడెలా వున్నాడో...!

రెడీ మేడ్ బట్టల షాపు ముందు పిల్లల స్వెట్టర్లు రకరకాలవి, రంగురంగులవి షో కేసుల్లో పెట్టారు. దుప్పటి బదులు కొడుక్కి ఒక స్వెట్టర్ కొంటే ఎలా వుంటుందో ఎంత ఖరీదవుతుందోనని రంగడు ఆలోచిస్తుండగా – "త్రీ స్టార్ బార్ అండ్ రెస్టారెంట్" ముందు కారాగింది.

రంగడు జంకుతూ లోపలకెళ్ళి కౌంటర్ ముందు కూర్చున్నవాడితో తనొచ్చిన పనేమిటో చెప్పాడు. లోపల చాలా గదులున్నాయి. మధ్యలో ఒక పెద్ద హాలుంది. హాల్లో చాలామంది తాగుతున్నారు. తింటున్నారు. తింటూ తాగుతున్నారు. తాగుతూ తింటున్నారు. మసక మసగ్గా వెలిగే లైటు, మెల్లగా మెల్లగా వినిపించే పాశ్చాత్య సంగీతం... మధ్యమధ్యలో నవ్వులు.. గదుల్లోంచి "బేరర్!" అని అరుపులు... సీసా మూతలు తెరిచిన శబ్దాలు. మత్తు వాసనలు.

ఆ పరిసరాల్నీ, ఆ మనుషుల్నీ వింతగా చూస్తూ, తాగితే చలి తగ్గుతుందంటారు నిజమేనేమో అని ఆలోచిస్తుండగా ఒక బేరర్ వచ్చి రంగడి చేతికి పొట్లాం ఇచ్చాడు.

పొట్లం వెచ్చగా వుంది. కమ్మటి వాసన, ఘాటైన వాసనేస్తోంది. ఆ వాసన పీలుస్తూ, అందులో ఏమేమి పదార్థాలుంటాయో, అవెంత రుచిగా వుంటాయో, ఎంత ఖరీదుంటాయో అంచనా వెయ్యటానికి ప్రయత్నిస్తూ రంగడు తిరిగి వెళ్ళేసరికి, తొమ్మిదయింది.

వెంటనే మేడపైకి వెళ్ళాడు. గది తలుపులు దగ్గరగా వేసి వున్నాయి. తోసుకుని లోపలికెళ్ళాడు. రాజారావు, రోజీ ఒకళ్ళనొకళ్ళు ఆనుకుని కూర్చున్నారు. సోఫా ముందున్న టీపాయ్ మీద విదేశీ విస్కీ సీసా వుంది. ప్లేటులో చిప్సూ, జీడిపప్పూ వున్నాయి. కొన్ని ఖాళీ ప్లేట్లూ, స్పూన్లూ, ఫోర్కులూ వున్నాయి.

ఇద్దరూ విస్కీ తాగుతున్నారు. ఇద్దరూ సిగరెట్లు తాగుతున్నారు. తలుపులన్నీ మూసెయ్యడం మూలాన గదిలో వెచ్చగా వుంది.

రంగణ్ణి చూడగానే "వెరీ గుడ్! తెచ్చావా? అక్కడ పెట్టేసి తలుపులు వేసేసి నువ్వు బయట కూర్చో..." అన్నాడు రాజారావు.

ఇంటికెళ్ళి పోతానని చెప్పడానికి రంగడికి ధైర్యం చాల్లేదు. తలుపులు మూసి, గుమ్మం పక్కనే గోడకానుకుని కూర్చున్నాడు చలికి వణుకుతూ.

గదిలోంచి తను తెచ్చిన పొట్లంలోని పదార్థాల వాసన. సిగరెట్ల వాసన. గ్లాసుల చప్పుడు... గాజుల చప్పుడు... గుసగుసలు... నవ్వులు... తొమ్మిదిన్నరైంది... పదైంది... పదిన్నరైంది.

ఇదంతా రంగడికి కొత్త కాదు. కాని –

త్వరగా వస్తాననీ, దుప్పటి కొనుక్కొస్తాననీ భార్యతో చెప్పి వచ్చినందుకు ఇవ్వాళే ఇంత ఆలస్యమవుతుందనుకోలేదు. ఏం చెయ్యటానికీ తోచటం లేదు.

చలి ఎక్కువైంది.

లోపల ప్లేటు కిందబడి పెద్ద చప్పుడైంది. ఆ వెంటనే బిగ్గరగా రాజారావు నవ్వు రోజీ నవ్వు... "ఒరే రంగా... రారా..!" పిలిచాడు రాజారావు.

రంగడు లేచి లోపలికెళ్ళాడు. సోఫాలో ఒకళ్ళ మీదొకళ్ళు పడిపోతూ కూర్చున్నారు. రాజారావు కళ్ళు ఎర్రబడ్డాయి. రోజీ కళ్ళు మూతలు పడ్తున్నాయి. విస్కీ సీసా ఖాళీగా వుంది. ప్లేటులో నమిలి వూసిన మాంసం ముక్కలు... బొమికలు.

"ఒరే! కిందరూమ్‌లో పక్కలవీ సరిగ్గా వేసి నువ్వెళ్ళిపో...!" అన్నాడు రాజారావు.

పైనొకటీ కిందొకటీ రెండు బెడ్ రూములున్నాయి. పై దానిలో రాజారావు, కమలాదేవీ పడుకుంటారు. కమలాదేవి ఇంట్లో లేనప్పుడల్లా, కొత్త ఆడదాన్ని తీసుకొచ్చినప్పుడల్లా రాజారావు కింది రూమ్ వాడుకుంటాడు.

కింది రూమ్‌లో హంసతూలికాతల్పాల్లాంటి రెండు మంచాలున్నాయి. వాటి మీద మెత్తటి ఫోమ్ రబ్బర్ పరుపులున్నాయి. గోడల నిండా అర్ధనగ్నంగానూ, పూర్తి నగ్నంగానూ వున్న ఆడవాళ్ళ బొమ్మలున్నాయి.

ఇస్త్రీ చేసిన దుప్పట్లు మడతలు విప్పి మంచాల మీద పరిచాడు. ఇంకా చాలా దుప్పట్లూ, రగ్గులూ ఒక చోట పెట్టి వున్నాయి. వాటిల్లో ఒక రగ్గు తీసి పరిశీలించి చూశాడు. చాలా అందంగా వుంది. మెత్తగా పట్టులా వుంది. ఇది కప్పుకుంటే ఎంత

హాయిగా వుంటుందోనని కాస్సేపు ఆలోచించాడు. గబగబా ఆ రగ్గు తీసుకుని గది బయటికొచ్చి, వరండాలో ఒక మూల, లైటు వెలుగు పడని చోట దాచి పెట్టాడు.

పైకి వెళ్ళబోతుండగా రాజారావు, రోజీ వాళ్ళంతట వాళ్ళే, ఒకళ్ళ నడుం చుట్టూ ఒకళ్ళు చేతులేసుకుని తూలుతూ కిందికి దిగొచ్చారు. రోజీ పమిట జారిపోయి నేల మీద పడుతోంది. అయినా లెక్కలేకుండా రంగణ్ణి చూసీ చూడనట్టుగా బెడ్ రూమ్‌లోకి వెళ్ళిపోయి, తలుపు లేసుకున్నారు.

పదకొండు కొట్టింది హాల్లో గడియారం.

రంగడు ఒక్కసారి అటూ ఇటూ చూసి, దాచిన రగ్గు తీసి చంకలో పెట్టుకుని గబగబా బయటికొచ్చేశాడు. గేటు దగ్గర ఘూర్ఖా చూస్తాడేమోనని జడిశాడు కాని... చలికి జడిసిన ఘూర్ఖా కారు షెడ్డులో దూరి, కునుకుతూ కూర్చున్నాడు.

వీథుల్లో ఎక్కడా జనసంచారం లేదు. చలి పెరిగిపోయింది. ఇంకా పెరుగుతోంది. రంగడి గుండెల్లో దడ పెరిగినట్లు; ఇంటికి త్వరగా వెళ్ళాలనే ఆత్రం పెరిగినట్లు, భర్త కోసం ఎదురుచూస్తూ కూర్చున్న సీత కళ్ళల్లో దిగులు పెరిగినట్లు చలి పెరిగిపోతోంది.

ఇంకా రెండు మైళ్ళు నడవాలి. చంకలో వున్న రగ్గు విప్పి కప్పుకున్నాడు రంగడు. అంత చలీ మాయమైపోయినట్టుగా వుంది. "అబ్బ! ఎంత వెచ్చగా వుంది" అనుకున్నాడు. అది చూసి సీత మురిసిపోతుంది. ఇంక ఎంత చలేసినా ఫర్వాలేదు అనుకుంటూ త్వరత్వరగా నడుస్తున్నాడు. పొద్దునెప్పుడో తిన్న తిండి. సీత తను వెళ్ళేదాకా తినదు. వెళ్ళగానే ఇద్దరూ కలిసి తినేసి... వెచ్చగా రగ్గు కప్పుకుని.

కలలు కంటూ నడుస్తున్న రంగడు చటుక్కున ఆగిపోయాడు. ఎక్కణ్ణించో మూలుగులు... ఆర్తనాదాలు.

చుట్టూ చూశాడు. రోడ్డుకి కాస్త ఎడంగా, పాడుబడిన ఒక ఇంటి అరుగుమీద ఎవరో వున్నారు. దగ్గరకెళ్ళి చూశాడు. ఇద్దరు బిచ్చగాళ్ళు. ముసలివాళ్ళు. శరీరంలో బొమికలు తప్ప మరేమీ మిగలనివాళ్ళు. ఆ బొమికలపైన కప్పుకోవటానికి చర్మం తప్ప మరేమీ లేనివాళ్ళు చలికి ఆగలేక వణికిపోతున్నారు. ఏడుస్తున్నారు. ఓపిక లేక సరిగా ఏడవలేకపోతున్నారు.

రంగడు వాళ్ళని చూశాడు.

వాళ్ళు రంగణ్ణి చూసి ఇంకా ఏడవడం మొదలెట్టారు. ఏదో చెప్పబోయారు. మాటలు పెగిలిరాలేదు. ఇద్దరూ చేతులెత్తి నమస్కారాలు చేశారు. ఊబిలో కూరుకుపోతున్నవాళ్ళు, నీటిలో మునిగిపోతున్నవాళ్ళు, మంటల్లో చిక్కుకున్నవాళ్ళు దారినపోయే వాణ్ణి రక్షించమని ప్రాధేయపడినటు ప్రాధేయపడుతూ, పీక్కుపోయిన కళ్ళతో, జాలి కురుస్తున్న కళ్ళతో చూశారు.

రంగడింక వాళ్ళని చూడలేకపోయాడు. తను కప్పుకున్న రగ్గు తీసి వాళ్ళిద్దరికీ కప్పి, గబగబా ఇవతలి కొచ్చేశాడు.

చలి పెరిగిపోయింది.

తన నోటికి చిక్కబోతున్న జంతువుని చిక్కనివ్వకుండా చేసిన వేటగాడిమీదికి ఉరికే పెద్ద పులిలా చలి రంగడి మీది కురికింది. ఊరిబయటికొచ్చేసరికి ఇంకా విజృంభించింది. కనీసం ఇంకా అరమైలు దూరం నడవాలి. రంగడు చలికి తట్టుకోలేక వణికిపోతున్నాడు. ఆకలి వల్ల నీరసం ఎక్కువైంది. కాళ్ళు తడబడుతున్నాయి. ఇదే సమయమనుకుని వెయ్యికోరలతో అతన్ని చుట్టుముట్టింది చలి.

★ ★ ★

మర్నాటి ఉదయం –

నేతిలో వేపిన నాలుగు పెసరట్లతో, ఉడకబెట్టిన రెండు కోడిగుడ్లతో, రెండు కప్పుల ఓవల్టీన్‌తో బ్రేక్ ఫాస్ట్ ముగించి, "త్రీ ఫైవ్స్" సిగరెట్టు వెలిగించి, పేపరు తిరగేస్తున్న రాజారావు.

"నిన్నరాత్రి వచ్చిన కోల్డ్ వేవ్ కారణంగా నగరం వెలుపల ఒక యువకుడు మరణించాడు" అన్న వార్త చదివి,

"వండర్‌ఫుల్! ఈ దేశంలో చలికి కూడా మనుషులు ఛస్తున్నారన్నమాట!" అని బిగ్గరగా నవ్వుకున్నాడు.

○

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 15-5-970)*